

# ...టెలుగ్గాంధీ

ఆర్నెల్లుగా సిన్మాకత కోసం అష్టకష్టాలు పడుతున్న ప్రఖ్యాత బాక్సాఫీస్ చిత్రనిర్మాత గోవిందా రావుగారు ఓ సుప్రభాతాన ఉలిక్కిపడి నిద్రలేచేరు.

మరుక్షణం బెడ్ కాఫీ కూడా త్రాగకుండా కవిగారికి కబురంపేరు.

"గాంధీ సిన్మా చూసేవుటయ్యా. కవీ? " అని పరామర్శించేరు, రాగానే కవిగారితో కలిసి కాఫీ సేవిస్తూ!

"అబ్బే! చూడ్లేదండీ! మా బుడ్డోడు చూసొచ్చేడు. అందులో మనం కాపీ కొట్టేందుకేం దొరకవన్నాడు వాడు! అందుకే డబ్బు దండగెందుకని వెళ్ళలేదు" అన్నారు కవిగారు.

"నిజమే! రాత్రి నేన్జూసేన్లే! ఆ తీసినవాడికి మన బాక్సాఫీస్ ఫార్ములాలేవీ తెలిసిచచ్చినట్లు లేవు. అందుకే అన్నన్ని ఆవార్డులొచ్చి పడ్తున్నా నేనంతగా పట్టించుకోలేదు. కానీ... డబ్బులు కూడా బాగానే వచ్చిపడ్తున్నాయటగా? బాక్సాఫీసుని బాగానే బద్దలు కొడుతోందట గదా ఆ సిన్మా? "

"అవునండీ! అయిదరాబాదులో అయిదు హాల్సూ కలిపి ఇప్పటికే అర్థై వారాలాడిందిట!"

"మరింక ఆలోచనెందుకయ్యా కవీ! మన నెక్స్టట్ సిన్మాకత అదే. కాపీరైట్ బాధ కూడా లేదుగా!" అన్నారు, నిర్మాత గోవిందా రావుగారు.

కవిగారు తెల్లమొహం వేసేరు "అందులో మన బాక్సాఫీస్ ఫార్ములాల్లో ఒక్కదాని క్క్యాడా ఛాన్సుండదు గదండీ? " అన్నారు తటపటాయిస్తూ.

"లేకపోతే మనం పెడదాం. మనకదోలెక్కా అయినా ఏమీ లేని ఆ 'గాంధీ' కన్ని ఆవార్డులూ, బాక్సాఫీసూ కలిసోస్తూంటే. మరి మన బాక్సాఫీస్ ఫార్ములాలన్నీ గుప్పించి తీస్తే ఇంకెంత సక్సెస్సో ఆలోచించు. సరేగానీ, గాంధీగా మన హీరోల్లో ఎవరు బాగుంటారంటావు? కృష్ణ, శోభన్, ఎన్టీఆర్, ఏఎన్నార్? "

సూట్లు, డ్రీంసాంగులు లేని సిన్మాలో బోడిగుండుతో, గోచీగుడ్డతో నటించటానికి పెద్ద వాళ్ళు ఒప్పుకోరేమోగదండీ!"

"అంతగా అయితే గుండు లేకుండానే తీసేద్దాం. గాంధీటోపీ అని ఏదో ఉంది గదా, దాన్నడ్డం పెడదాం. సరే, కస్తూర్బాయే గదా హీరోయిన్? మనం ఆ పాత్రకెవర్ని పెట్టి

కుందాం? శ్రీదేవి, జయప్రద, జయసుధ, లేక ఏకంగా హేమామాలినినే బుక్ చేసేద్దామా? ఎలాగూ ఆలిండియా మార్కెట్టును దృష్టిలో ఉంచుకోవాలి గదా? "

"అలాగైతే నెహ్రూ వేషానికి అమితాబ్బచ్చన్‌నే పెడదాం సార్!"

"భేషో! మరి డాన్సులు? "

కవిగారు ఉలిక్కిపడి నిర్మాతగారికేసి చూసేరు. ఆయన సీరియస్‌గానే కనుపించటంతో ఆలోచనలో పడ్డారు.

"ఉండాల్సిందే గదండీ! విదేశీ వస్త్రదహనం సీను ఒకటి ఉంటుంది గదండీ! ఆ సీన్లో మన సిల్క్‌స్మితా ఓ కోటీశ్వరుడి కూతురు. ఆవిడ కాబరే టైపు డాన్సు చేస్తూ ఒంటిమీది మిల్లు గుడ్డలొక్కొక్కటే ఊడబీకి మంటల్లోకి విసిరేస్తున్నట్లు ఓ దృశ్యం పెడదాం".

"సెభాష్ కవీ! మరైతే మన స్మితా బ్రా, అండర్‌వేర్ కూడా విదేశీవే గదా! అవి కూడా తగలేస్తే... సెన్సార్...?

"ఫర్లేదుసార్! ఆ టైముకు గాంధీగారో నెహ్రూగారో ఓ ఖద్దరు అంగోస్త్రం మన స్మితామీదికి విసిరేస్తారా దృశ్యం చూడలేక. అప్పుడు స్మితా ఆ అంగోస్త్రాన్ని తొడలూ చంకలూ కనబడేలా చుట్టుకుని మరో ట్రైబల్ డాన్స్ చేస్తే సరి. ఒక్క షాటుకు రెండు డాన్సులు కలిసొస్తాయి!"

"మరి విలన్? "

"మన రావుగోపాల్రావున్నాడు కదా! బ్రిటిష్ వైస్రాయ్ వేషానికతన్ని బుక్‌చేసుకుందాం. గాంధీనీ, జాతీయోద్యమాన్నీ డిక్కీలోకి తీసేసి, భారత మాతను రేప్ చేయటానికి ఆ విలన్‌గాడు పన్నే కుట్రల్ని పసందుగా తీయించొచ్చు"

"అన్నట్లు గుర్తొచ్చింది. మరి రేప్ సీన్ సంగతేమిటి? "

"అది లేకుండా సిన్మా ఏంటిసార్? జిన్నా ఎలాగూ ఉంటాడు గదా! ఆ వేషానికి అమ్జాద్‌ని బుక్‌చేద్దాం. అచ్చం గబ్బర్‌సింగ్ మేకప్పే చేసి నెత్తిన ఓ బొచ్చుటోపీ పెడితే సరిపోతుంది. వాడు భారతమాత అనే రేఖనుగానీ జయప్రదనుగానీ చెరపట్టి రేప్ చేసేస్తాడు"

"చేసేస్తాడా...? మరి సెన్సార్...? "

"ఫర్లేదు... ఆ టైముకు మన అమితాబ్ నెహ్రూ పరుగెత్తుకొచ్చి వాడిని చితకదన్ని రేప్ ఆపుచేస్తాడు గదా!"

"చితకదన్నటం అంటే గుర్తొస్తోంది. మరి మన 'గాంధీ'లో స్టంట్లు ఉండొద్దూ? "

"అమ్మమ్మా... ఎంతమాట! అవి లేకుండా సిన్మాయే!"

"సరే, ఆ సీను సంగతి కూడా ఆలోచించు కవీ!"

"అదెంతసేపు సార్! భగత్‌సింగ్ వగైరా టెర్రరిస్టులుంటారు గదా! వాళ్లో రైలును పేల్చేయటానికి బాంబులు పెడతార్లెండి. అప్పుడు మన అహింసా గాంధీగారు పరుగెత్తుకెళ్ళి రైలు కట్టకు అడ్డంపడి ఎర్రజెండా ఊపుతూ, పడుతూ లేస్తూ మొత్తంమీద రైలును ఆపేస్తారులెండి!"

"దృశ్యం మరీ పాత చింతకాయలా ఉందయ్యా కవీ! అలాగాక గాంధీగారు బ్రహ్మాండమైన బహిరంగ సభలో 'రఘుపతి రాఘవ రాజారాం' పాడుతుండగా అకస్మాత్‌గా ఆయన బుర్రలో ఏదో ఫ్లాష్ వెలుగుతుంది. అపుడాయన కూకున్నపళంగా సూపర్‌మాన్‌లా ఎగిరెళ్ళి, ఆ బాంబుల్ని అంగోస్త్రంలో మూటకట్టుకుని, మళ్ళీ ఎగిరెళ్ళి వాటిని భద్రంగా బంగాళాఖాతంలో పారేసి, అర నిమిషంలో మళ్ళీ 'రఘుపతి రాఘవ రాజారాం'కు హాజరవుతారు!

అలాగైతే బ్రహ్మాండగా ఉండదూ! ఈ దృశ్యాన్ని తియ్యటానికి ఆ హాలీఉడ్డు వాడినే గెస్టు డైరెక్టరుగా పెట్టుకుందాం"

'బేషుగ్గా ఉంది, సార్, మీ అయిడియా! అంతకన్నా గాంధీగారు అలా సూపర్‌మాన్ స్టయిల్లో ఎగిరెళ్ళి, ఆ రైలుపట్టాలకాడ దిగీ దిగ్గానే అమాంతం అచ్చు భారతీయస్టయిల్లో ఆంజనేయులు వారిని తలుచుకుని శరీరం అమాంతం ఆరొందలరెట్లు పెంచేసి, ఆ పరుగెత్తే రైలును ఒంటిచేత్తో ఇలా ఎత్తి అలా ఆ బాంబులకు అవతల పెడితే అది యథావిధిగా పరుగెత్తుకెళ్తుంది. అదటు వెళ్ళగానే ఆ బాంబులు ఠాప్, ఢాం, ఘోష్ అంటూ పేలిపోతాయి. దృశ్యం సెన్సేషనల్‌గా ఉంటుంది గదా!"

"అవునవును! ఎలాగూ హాలీఉడ్డు డైరెక్టరును తెస్తాంగదా! అలాగే తీసేద్దాం"

"అన్నీ అయినట్లేగా! ఇహ డ్రీంసాంగ్ ఒహటీ మిగిలిపోయినట్లుందే? "

"అవున్సార్! అదోటి లేకుంటే మన టెల్గూ ప్రేక్షకులు తెరలు చించెయ్యరూ... అదీ ఆలోచిద్దాం. ఎలాగూ హేమామాలినిని బుక్ చేస్తున్నాం గదా గాంధీగారితో పెళ్ళి సెటిలవగానే సదరు హేమామాలినీ కస్తూర్బా దక్షిణాఫ్రికా బొగ్గగనులవద్ద గాంధీగారితో డ్యూయెట్లు పాడుకునే దృశ్యం ఒకటి పెడదాం. ఆ సాంగూ, ఈ డ్రీమూ అవగానే గాంధీగోరు ప్రవరాఖ్యుడిలా ఫోజుపెట్టి "హే కస్తూర్బా! నీకిది న్యాయమా? దేశసేవకే సమయము చాలక నే చింతించుచుండగా నీవిట్లు డ్యూయెట్లు పాడదగునా? " అని గంభీరోపన్యాసం ఇస్తారు. అదయిన మరుక్షణం కస్తూర్బా హేమామాలిని లెంపలేసుకుని మరో డాన్సు మొదలెట్టి "హే గాంధీనాథా, ఈ పాపిని క్షమియింపుమా" అంటూ మరో పాట పాడేస్తుంది. ఒక్క దెబ్బకు రెండు పాటలు! ఏమంటారు? "

"శెభాష్! కవీ! సరే! ఇందా! ఈ పదిరూపాయలూ పట్టుకెళ్ళి బియ్యం, పప్పులూ కొనుక్కో! ఖబడ్దార్, ఈ మన అయిడియాలు ఇంకెవడన్నా ప్రొడ్యూసర్‌కు చెప్పావో నీ డొక్క చీల్చి....."

*(ఈనాడు, 16.3.1983)*

☆